# అభిప్రాయాలు

శ్రీ పులిపాక బాలాత్రిపురసుందరమ్మగారు

"హా రామా! హా లక్ష్మణా! యని అశోకవృక్షం క్రింద ఆసీత విలపించుచుండగా ఆసమయమునందే, శ్రీరాముని బంటు అయినటువంటి, హనుమంతుడు ఆవృక్షము క్రింద సీతనుచూచి ఆవృక్షముమీదికి ఎక్కి, తాను తెచ్చిన ముద్రిక ఆమెముందుకు పడునట్లు, యెటు వేతునా అని ఆలోచిస్తున్నాడు" అని. గోపాలస్వామి కోవెల్లో దీక్షితులుగారు, వాల్మీకి రామాయణంలో సీత అశోకవృక్షంక్రింద విలపించే ఘట్టాన్ని, అందరికి వినిపించాలని పెద్దకంఠస్వరంతో ఆయన శక్తివంచన లేకుండా చెవుతున్నాడు పురాణం. గాని సభలో మాత్రం, పలుచోట్ల పలు విధములుగా ధ్వనిచేస్తూనే ఉన్నారు జనం. "రాధా; మీతమ్ముడి పెండ్లికెళ్లావు కాబోలు. ఎప్పుడొచ్చావు? మీకందరికి ఏమియేం యిచ్చారు చెప్పావే కావు గదా?" అన్నది సుశీల రాధవంక చూసి.

"నేనువచ్చి వారం ఐంది సుశీలా; మా అమ్మతో సహా. ఆరుగురికి వేరు వేయి నూటపదహార్లు, కాళ్లు కడుగు వెండిపళ్లాలు, వెండిచెంబులు, బొట్టుపెట్టెలు వగైరా సామాను, మాతమ్ముడికి రవ్వ వుంగరం రేడియో యిచ్చారు. ఐదురోజులు పెండ్లి చేశారు." ఇంతలో పక్కనే కూర్చున్న విమల అందుకుని వాళ్ల పులును బాగా వంచారే అన్నది నవ్వుతూ.

"మేం వంచేదేమున్నది? వాళ్లేయిస్తామన్నారు యిచ్చారు."

"అయితే! నీకట్టెవంకీ యెప్పుడొచ్చిందే విమలా!" అన్నది సుశీల! వంకీ పట్టిచూస్తూ.

"మొన్న శుక్రవారం నోములకు యిచ్చాడు బాగున్నదిటె సుశీలా!"

"బాగానే వున్నాది. అబ్రహ్మ మేగా నారాళ్ల గాజులు యిచ్చేడేగాదు గదా? పెళ్లికొచ్చాడ వెళ్లొచ్చాను. ఎప్పుడో యిస్తాడు."

"మీవీధికి జాజిపూలు వస్తాయిటె కమలా?" అని కమల పూవులు సవరిస్తూ అడిగింది విమల.

"మాకు రోజు వాడుగ్గా యిస్తాడు. నేను వాకిట్లో ఉన్నా లేకపోయిన, పిల్ల చేతికిచ్చి వెళతాడు. ఎప్పుడో డబ్బులు తీసుకుంటాడు."

"రేపు మాయింటికి పంపు కమలా! మావీధికి గులాబిపూలు వస్తాయిగాని జాజులురావు; తప్పకుండా పంపు."

ఇంకొకచోట, వెంకమ్మతో "ఇప్పుడు యింజనీరుగారింట్లోనే ఉంటున్నావా నువ్వు, అక్కణ్ణించి లేచావా?" అన్నది జానకమ్మ.

"అక్కడే ఉంటున్నా జానకమ్మగారు ఎక్కడన్న మంచి చోటు వుంటే చెప్పు."

"ఏం, వాళ్లుమంచివాళ్లు కారూ?"

"అబ్బా ఆమెదగ్గిర చెయ్యటం చాలా కష్టం వెంకమ్మా."

"ఏమికష్టం? ఏమంటుందేమిటి?"

"ఏమనాలి? ప్రొద్దుగూకులు కూర్చోకుండా చెయ్యమంటుంది. అట్లా చేసినా ఆమెకు మెప్పలేదు. అది బాగుండలేదు. ఇదిబాగుండలేదు. అని ప్రొద్దుగూకులు విసురుతూనే ఉంటుంది. పసిపిల్లల కంచాల దగ్గిరనుంచి దేవతార్చనదాకా, వక్కదాన్నే చెయ్యాలి. నాప్రాణం విసుగ్గా ఉందమ్మ. డబ్బిస్తే మాత్రం అట్లా ఏడిపిస్తుంటె కష్టంగాదూ? ఎన్ని రోజులవుంచో అడుగుతుంటె ఇక్కడికి యివాళ

పంపింది. ఎక్కడన్నా కుదిరితే చేస్తానమ్మా. నీవున్నావంటె హాయిగా ఉన్నావు తోచినపని చేస్తూ వాళ్ళల్లో కలిసిపోయి."

"ఆ! అంతామంచే మనం సర్దుకు పోతుంటే వంట దగ్గిరికి వెళితె వాళ్ళింట్లో ఎంతకష్టమో నీకేం తెలుసు? కొందరికి నూనె వేపుడు, కొందరికి నేతివేపుడు, కొందరికి బంగాళాదుంప, కొందరికి తోటకూర, కొందరికి వేపుడు కూర, యింతలో అల్లుడొస్తే యింకో ప్రత్యేక కూర. ఎన్నిచేసినా ఒక్కటి మిగలకూడదు; తగలకూడదు. అతిజాగ్రత్తగా చెయ్యాలి. యింతాచేస్తే చేసినవాళ్లకు ఒకరోజు మిగులుతుంది; ఒకరోజు మిగలదు. ఇల్లాంటివి యేం చెప్పకుంటాం? పురాణం అయిందాక ఉండటానికి వీల్లేదు యివ్వాళ సినిమాకు వెళతారట. తొందరగా వంటకావాలి. నేవెళతాను. నువ్వుంటావా వెంకమ్మగారూ?"

"నేను వెళతానండీ. ఆలశ్యమైతే ఊరుకోరు" అని ముసుగు సవరించుకుంటూ లేచింది జానకమ్మ. యిద్దరూ వెళ్ళిపోయినారు."

"ఏం నిద్రవస్తున్నట్లున్నది రాత్రి భాగవతానికి వెళ్లారా? అన్నది తట్టిలేపుతూ" శేషమ్మగారు.

"సూరమ్మగారు తృళ్ళిపాటుతో కళ్లుతెరచి ఏమిటి శేషమ్మగారూ ఏదో అట్లా కన్నంటింది. సరేగాని మీకోడలు వెధవచెల్లెలి పెండ్లికెళ్లిందిటే! వచ్చిందీ?"

"ఆ వచ్చిందమ్మ మొన్ననే వచ్చింది."

"ఆవిడ వంటచేస్తే నువ్వు తింటున్నావుగా?"

"ఒకనాడావిడ నాకొండి పెట్టిందీ? ఎప్పుడూ నేనె వండుతాను. అయినా తినక తప్పేదేమున్నది?"

"ఆ యిందులో యేంతప్పున్నదిలే. సోమయాజులుగారి కొడుకు వెధవముండను పెండ్లిచేసుకొచ్చాడుట. ఇప్పుడు ఆ మామగారి దేవతార్చనకుకూడా ఆ అమ్మాయే వంటచేస్తుందిట. అంతకంటె మనమేం ఎక్కువైన వాళ్లమా? అంతా కలిసేపోయింది; ప్రపంచం మాలకూడైంది. ఎవరి నన్నా కదలించు గాంధిగారు చెప్పారంటారు. ఆయన మాత్రం కుల భ్రష్టుల్ని కమ్మన్నారా? ఐకమత్యంగా ఉండమన్నారుగాని."

"ప్రొద్దు గూకుతున్నది సూరమ్మా! యింటికెళ్లాలి."

"ఇంట్లో కోడలుందిగా? ఉండు పురాణం ఐందాక - వెళదాం."

"కోడలుంటేమాత్రం నాకేం లాభం? నా వంట నాపని నాదే. రెక్కలాడినన్నాళ్లు చేస్తే తరువాత తిప్పలు భగవానునకే ఎఱుక. కొడుకు ఫలహారం చేసి వెళ్లగానె తాను ముస్తాబై వెళుతుంది. వాడు ఇంటికొచ్చేవేళకు వస్తుంది. ఒక్కొక్కరోజు కూడానే వస్తారు. ప్రొద్దుకూకుతుంది. పెద్ద పిల్లలు అన్నానికేడుస్తూ ఉంటారు. పసివాడు పాలకేడుస్తూ ఉంటాడు. పెరుగు తెచ్చేవాళ్లు పాలుతెచ్చేవాళ్లు నుంచుంటారు. దీపాలు వెలిగించాలి. నేనుమాత్రం బుడ్డిదీపం వెలిగించుకుని వంటయింట్లో నాపని నేను చేసుకొని రామాకృష్ణా అనుకుంటూ కూర్చుంటా. ఇంత చిరాకుగా యిట్లఉన్నా. పిల్లలు ఏడుస్తున్నా ఆదేమి? అనడు వాడు. అల్లాంటప్పుడు నాకు మాత్రం ఎందుకు? నేను చూస్తూ ఊరుకుంటా. అన్నాలు పెట్టమని వంట యింట్లోకివస్తే పెడతా. అందాక ఆ గొడవ నేనేమి కలుగజేసుకోను నాకెందుకు?"

"ఊరుకోక మనకెందుకు? మా యింట్లో తంతు అంతా యింతే మనకేం కావాలి పోదూ! వస్తారా? హారతిస్తున్నారు వెళదాం."

"ప్రసాదం తీసుకోరూ?"

"మనకందదులెండి" అన్నది శేషమ్మగారు ఇద్దరు కొంగుదులుపుకొని కబుర్లు చెప్పుకుంటూ వెళ్లారు. యింతలో దీక్షితులుగారు లేచి "అమ్మా సభా తల్లులందరికి నా నమస్కారములు. సభలో యింత అలజడి చేస్తుంటే పురాణం చెప్పటం చాలా కష్టం. సీత లంకలో ఉండగా రాములవారి ముద్రిక హనుమంతుడు సీతకు యిచ్చే ఘట్టం యిప్పుడు వచ్చింది.

గనుక తల్లులందరు యెవరి శక్తికొలది వారువేసి ముద్రిక చేయించి తెచ్చి ప్రత్యక్షముగా సీతకు సమర్పించి, సావకాశంగా రేపు పురాణ శ్రవణము చేయుదురని నమ్ముచున్నాను" అని స్వస్తిచెప్పి, దీక్షితులుగారు పురాణం ముగించి, పుస్తకం చంక బెట్టుకొని వెళ్లారు. అందరు లేచి యెవరిండ్లకువాళ్లు వెళ్లిపోయినారు.

## ౨

మధ్యాహ్నం మూడుగంటలైంది. ఇన్స్పెక్టరు గారి అత్తగారు భగవద్గీత చదువుకుంటూ భోజనాల హాల్లో కూర్చున్నది. ఇంతలో డాక్టరు గారితల్లి అన్నపూర్ణమ్మగారువచ్చి అక్కడేఉన్న పీటమీద కూర్చుని తానుకూడ ఆ పేజీలవంక చూస్తూ "మాణిక్యమ్మగారు కాలాన్ని ఒక్క క్షణంకూడా వృధాపోనీయరు. ఏమండి! ఈ మధ్య పురాణానికే మనాన్న వెళుతున్నారా? యివ్వాళ వస్తారా?" అన్నది ఆమె వంకచూస్తూ అన్నపూర్ణమ్మగారు.

కళ్లద్దాలు పైకి తీసుకొని "మీరు ఊరునుంచి ఎప్పుడు వచ్చారు అన్నపూర్ణమ్మగారూ? అన్నది మాణిక్యమ్మగారు పుస్తకం క్రింద పెడుతూ."

"నిన్న వచ్చానండీ."

"మొన్న ఒక రోజు పురాణానికి వెళ్లానుగాని, అక్కడ విననిస్తారా? వినపడుతుందా? వచ్చిన వాళ్లంతా వాళ్లవాళ్ల యిండ్ల దగ్గిర కబుర్లన్నీ పురాణం దగ్గిరే చెప్పుకుంటారు. వాళ్లు వినరు యింకొకళ్లను విననివ్వరు. అందుకని మళ్లీ వెళ్లలేదండి. ఆ రోజుతోనే పురాణం చాలనిపించింది నాకు. నిన్న మా అమ్మాయితోకూడ సమాజానికి వెళ్లాను. అక్కడ సావకాశంగా కూర్చున్నా, విన్నా. విన్నది మనస్సుకు పడుతుంది. ఆ రాజేశ్వరమ్మగారు భారతం చదివి అర్థం చెపుతుంటే అంతా మనకళ్ల కఫుపడ్డట్లే ఉంటుంది."

"ఏం చెప్పింది మాణిక్యమ్మగారు. కొంచం చెప్పండి వింటాను."

"భారతం అంతా యీ తత్వానికి సరిపుచ్చింది. ఈ దేహమే కురుక్షేత్రం. హృదయమే రథము. జీవాత్మ అర్జునుడు, పరమాత్మ కృష్ణుడు. బుద్ధి ధర్మరాజు. మనస్సే భీముడు. చిత్తం నకుల సహదేవులు. శాంత, శమ, దమాది గుణములే పాండవుల సైన్యము. అహంకార, క్రోధడంబ, అసూయ, మదమత్సర్యాది ప్రవృత్తులన్నీ, దుర్యోధనాదులనే కౌరవులసేన. జీవాత్మ అనే అర్జునుడు, హృదయమనే రథము ఎక్కి, పరమాత్మ అనే కృష్ణుని రథసారథ్యముచేత ఆయుధ రంగమునందు ఓంకారమనే రణభేరి మ్రోగించి, దుర్యోధనాదులనే దుష్టప్రవృత్తులను శాంతమనే బాణముచేత సంహరించి జీవాత్మ అనే అర్జునుడు, కృష్ణుడనే పరమాత్మలో చేరాడు. అని యిల్లాగే యెన్నో చెప్పింది ఆమె. నాకన్నీ జ్ఞాపకం ఉండవండి. మీరడిగారు గనుక ఏవో రెండు ముక్కలు చెప్పాగాని; నాకు మాత్రం అన్నీ జ్ఞాపకమున్నయా అన్నపూర్ణమ్మగారూ?"

"అవునండీ మాణిక్యమ్మగారు విని గ్రహించే వాళ్లకు ఎక్కడైనా ఉన్నది. అగుళ్లోచెప్పే దీక్షితులుగారు కూడా యిల్లాగే చెప్పారు రామాయణమంతా. ఈశరీరమే తొమ్మిది ద్వారములుగల ఆయోధ్యా పట్టణము. దీనికి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములనే షడ్ వర్గములు. ఆరు ప్రాకరములు. షడ్ చక్రములనే, ఆధార, స్వాధిష్ట మణిపూరక, అనాహత, విశుధ, ఆగ్నేయ, ఆరు అంతస్తులమేడ, దానిలో మనస్సనేగది. దానిలో జీవుడనే రాముడు. ఆ శ్రీరామచంద్రుడు, సుగుణమనే గొడ్డలిచేత, దుర్గుణమనే అడవి నరికి, సంసారమనే సముద్రమునకు, సత్వగుణమనే వారధికట్టి, శాంతమనే కోదండముచేతబట్టి, అహంకారమనే రావణుని, సంహరించి, పరమాత్మ అనే రాముని కొరకు విలపించుచున్న, ముక్తికాంత అనే సీతను పరిగ్రహించి, సహస్రారమనే వేయిరేకులుగల, పుష్పక విమానమెక్కి, జీవాత్మ అనే శ్రీరామచంద్రుడు, ముక్తికాంతతోసహా, పరమాత్మలో చేరెను, అని యిల్లాగే ఎన్నో చెపుతారు ఆయనగారు

కూడాను. కాని మీరుచెప్పినట్లు విననీయరు. ఎప్పుడో ఒకరోజున కొద్దిజనం వస్తే? మనం దగ్గరగాకూర్చుంటే ఇల్లాగె రెండుముక్కలు వినబడతాయి. అయితే మీరు రారన్నమాట?"

"అవునండి రాను."

"మాకోడలు కూడా, ఎప్పుడు యిల్లాగె అంటూ ఉంటుంది. గాని నేనెప్పుడు సమాజానికి వెళ్లలేదండి అక్కడేవో ఆటలు పాటలు, నవలలు చదువుకోడం అని నానమ్మకం."

"అవును; అవీ వున్నాయి. వారానికి రెండు దఫాలు పురాణ కాలక్షేపం ఉంటుంది."

"మళ్లీ మీరు వెళ్లేటప్పుడు నాక్కూడ కబురు చెయ్యండి వస్తాను."

"అల్లాగే లెండి."

"ఇక యివాళ, యింటికి వెళతాను. ఈకబుర్లతో చాల ప్రొద్దు గడచి పోయింది.

(సశేషము)


# మంత్రాలకు ఏల చింతకాయలు రాలకూడదు?

ఒక్కొక దానివెల:-రు 10, 30, 116 లు.

తావేజులపేర్లు:—సంతాన గోపాలం (బిడ్డల పుట్టడానికి) కుబేరాస్త్రం. (ధనం) కాళీకవచం (వ్యవహారం) సిద్ధకామ్యా: (ప్రేమ, వివాహానికి) నిర్విఘ్నం: (చిక్కులు తొలుగుటకు) ఆంజనేయాస్త్రం: (దయ్యాలకు) కపాలి: (సర్వార్థసిద్ధికి) సమ్మోహనాస్త్రం: (వశ్యానికి, ఆటల్లో గెల్పుకు) చిరంజీవి: (చాలాకాలం జీవించుటకు) రాజ్యలక్ష్మిఅస్త్రం: (లైసెన్సులు మొ॥ సర్వ రాజకార్యాలకు) బ్రహ్మానందం: (భార్యా భర్తల వశ్యానికి) మదనం: (కోరినది అగుటకు) సుదర్శనం: (సభాప్రజావశ్యం) చింతామణి: (పరీక్షాజయానికి) ధనుంజయం: (కీళ్ళనొప్పికి) మహేంద్రం: (పదవీ సింహాసనాలకు) కుమారం: (యుద్ధనష్ట నివారిణి) లక్ష్మీనారాయణం: (వ్యాపార లాభానికి) బడబానలం: (ఆరోగ్య, కోర్టు, కచ్చేరి జయాలకు) ఉగ్రభైరవం: (శతృనాశనానికి) మహావారుణి: (విపత్తులు రాకుండుటకు) కౌముది: (శుభవార్తలకు) ఉగ్రనారసింహ్వం: (సింహాసనానికి) లక్ష్మీగణపతి: (ఆఫీసర్లజయానికి, ధనానికి) సుజాతం: (సుఖప్రసవానికి) లంకేశ్వరం: (కడుపు రాకుండుట) మయూరం: (ఎలెక్షను-పందెముల జయానికి) హయగ్రీవం: (మాటలకు) దక్షిణామూర్తి: (విద్యకు, మరపురాకుండుటకు) త్రిపుర సుందరి: (సౌందర్యానికి) ప్రబలా: (యవ్వనపుబలానికి) భ్రామరీ: (కంఠానికి) వారాహి: (శతృత్వ నాశనానికి) స్వాంతం: (పోయినవి లభించుటకు) బాలానందం: (పిల్లలారోగ్యానికి) మైత్రావరుణి: (ఇంట్లో నసకు) రాధాకృష్ణం: (వివాహానికి) శాకుంతలం: (వృత్తికోసం)

త్రికాల వేది, జ్యోతిష్యచక్రవర్తి, మంత్రమూర్తి, (ఫోను 86637)

ప్రొఫెసర్. కె. ఆంజి, 15 వెస్టుకాట్ రోడ్డు, రాయపేట, మద్రాసు-14




*

# అభిప్రాయాలు

శ్రీ పులిపాక బాలాత్రిపురసుందరమ్మగారు

(గతసంచిక తరువాయి)

## 3

స్త్రీ సమాజానికి ఇన్‌స్పెక్టరుగారి భార్య ఇందిర కార్యదర్శి. మధ్యాహ్నం మూడుగంటలైంది. యిందిర తలదువ్వుకుని, సమాజానికి వెళ్లటానికి సిద్ధపడి, తన స్నేహితురాండ్రకోసం ఎదురుచూస్తున్నది. కొంతసేపు చూసి, జవాన్ను పంపింది వాళ్లకోసం. వెంటనే వచ్చింది సుశీల.

"యేమోయి ఇందిరా! యెందుకు? అర్జంటుగా కబురు పంపావు?"

"యెందుకేమిటి? ఇవాళ మహాత్మ జయంతి గాదు?"

"నాకు నోటీసు రాలేదేం?"

"రాకపోవడమేమిటి? యిదుగో పుస్తకం నీ సంతకం చూసుకో."

"ఇది మావారి సంతకమోయ్. అచ్చంగా నాలాగే రెండు పొడక్షరాలు పెడతారు. యం. యస్. అని. నేను మళ్లీ అడిగితే, ఎవరైతేయేం మన మిద్దరం ఒకటేకదూ? అంటారు. మనం యేదైనా విషయం నాకు తెలియాలికదా? అంటే. నీస్నేహితులు నీకు కబురు చెయ్యరా? నీవు వళ్లవా? అప్పుడు నిన్ను పిలిస్తే, దాంతో ఒక గంట కబుర్లు చెప్పుకుంటూ, వంటాలస్యం చేస్తావు. నాకు ఆఫీసుకైమౌతుంది. అని హస్యంగా నవ్వుతారు. వారు వాకిట్లో ఉన్న రోజు నోటీసువస్తే యెప్పుడు ఇంతేనోయి. ఇందిరా! ఇంకా సీతకూడ రాలేదే"?

"ఆవిడకూ తెలియదేమో, కృష్ణజయంతి నాడు ఆవిడ ఇల్లుగే మొత్తుకుంది. వాళ్లపిల్లలెవరో ఒకరు సంతకం పెట్టి పంపుతారట. ఆవిడకు ఒకప్పుడు చెపుతారు ఒకప్పుడు చెప్పరుట. నీవువెళ్లి చెప్పిన సిద్ధపడిరా. ఇంతలో వస్తేవస్తుంది. రాకపోతే దారేగా వెళ్తుతూ మనం కేక వేద్దాం."

"ఓహో శ్రీ లక్ష్మీ: యెప్పుడొచ్చావు? అత్త వారింటినుంచి. మీ బామ్మకూడా వచ్చిందే. కూర్చోండి బామ్మగారు! అని పీటవేసింది ఇందిర."

"ఆ. నాతో వచ్చిందిగాని ఆవిడకేం తెలియదండి."

"నీకు మాత్రంతెలుసు కాబోలు" అన్నది యిందిర ముసలావిడ పక్షంగా.

"అది కాదండి అత్తయ్యగారు. మా బామ్మ పురాణానికి వెళ్తుతుందా - రాంగానే మానాన్నగారు, మేముఅంతా అక్కడ యేచెప్పారు బామ్మ అని అడిగితే? భాగవతం చెప్పారు. ఆ సీతవనవాసం వింటుంటే దుఃఖంవస్తుందిరా నాయనా అంటుంది. మేమంతా విరగబడి నవ్వుతాం. సినిమాకు వెళ్లినా అంతేనండి. బామ్మ ఏంచూస్తున్నావే అంటే ఏవో బొమ్మలు చూస్తున్నానమ్మా అంటుంది. యేమే బామ్మ! నిజమేనా అని ఆముసలామె వంక చూసి, విరగబడినవ్వి, యివ్వాళ సమాజంలోకూడా, యేవన్నా ఆటలున్నాయేమోనని వచ్చిందండి అన్నది ఇందిరవంకచూసి శ్రీ లక్ష్మి."

"ఓసి బడవాపిల్లా, యింకా నాకేంకావాలే నవ్వుకో" అని ఆమెకూడ నవ్వింది.

"ఇందిరా! డాక్టరుగారి తల్లికూడ సమాజానికి వస్తానని చెప్పిందిమొన్న; జవాన్ను పంపుతావా" అని ఇందిరతల్లి కేకవేసింది ఇంట్లోనుంచి.

"ఇవ్వాళ వాళ్లకు నోటీసువెళ్లింది, కోడలు చెపితే వస్తేవస్తుంది. అదిగాక ఇవ్వాళ ఆవిడకు తెలిసినవిషయాలేమిలేవు. ఈ ఇవ్వాళ మహాత్ముణ్ణి గురించి, దేశాన్ని గురించి ఆ విషయాలు ఆవిడకేం వచ్చుతాయి? బేబీని నేను తీసుకువెళ్ళుతున్నాను. దాయికి పాలు పట్టాను. తలుపులన్నీ తిన్నగావేసి, తాళాలు చాకలికిచ్చి, దాయిని జవాన్ని యెత్తుకోమని, రండి కొంచం చీకటిపడేసరికి. లైటు వెలిగించి తీసుకురమ్మని చాకలికి చెప్పిరా, నేను వెళుతున్నా" అని తల్లికిచెప్పి సమాజానికి వెళ్లింది యిందిర.

## ౪

మధ్యాహ్నం రెండుగంటలైంది. ఇందిర తన గదిలో కూర్చుని, ఏదో వ్రాసుకుంటున్నది. ఇందిర తల్లి భోజనాలహాల్లో చిరిచాపమీద కూర్చుని, ఒత్తులు చేసుకుంటున్నది. ఇంతలో డాక్టరుగారితల్లి అన్నపూర్ణమ్మగారువచ్చి," ఏమండి మాణిక్యమ్మగారు! ఒత్తులు ఎక్కువగా చేస్తున్నట్టున్నారు, నోమేదన్నా తలుచుకున్నారా? అన్నది చంకలోఉన్న మనుమణ్ణి దింపుతూ.

తలయెత్తిచూచి, "ఓహో అన్నపూర్ణమ్మగారు! ఎండలో వొచ్చారే! ఏదోపనిమీద వచ్చారనుకుంటాను, కూర్చోండి" అని కొంచం అవతలఉన్న పీట యివతలికి లాగింది మాణిక్యమ్మగారు.

"ఏమిపనిలేదండి ఇవ్వాళ మా అబ్బాయి ఊళ్ళోలేడు. తీరుబడిగాఉంది యింట్లో. మీ దగ్గరకొస్తే కొంచం మంచి కాలక్షేపణ జరుగుతుందనివచ్చాను. మా కోడలు మీ అమ్మాయి యెల్లుండి కాకినాడ వెళ్తారటకదూ? మా కోడలు ఏదో వ్రాసుకుంటున్నది. ఈ పిల్లవాడు ఏదో పేచీ పెట్టుకుని తల్లిదగ్గరకెళ్ళి ఏడిపిస్తాడు ఆవిడ విసుక్కుంటుంది అందుకని వీణ్ణికూడ తీసుకొని ఇల్లా వచ్చాను."

"అవునండి మా అమ్మాయి అంటున్నది, ఎల్లుండి పన్నెండుగంటల బండికి వెళుతారటగదూ? మీ కోడలి ప్రయాణం నిజమేనా?"

"నిజమేనండి. మా అబ్బాయికికూడా ఆడ వాళ్ళ సభలూ, మీటింగులు అంటే చాల ఇష్టం. అందువల్ల వాడే ముందు ప్రయాణంచేస్తాడు. అయితే మాణిక్యమ్మగారూ? ఇంతకష్టపడి ఆడ వాళ్ళంతా పనిచేసి, మీటింగులుజరిపి, స్వాతంత్ర్య మని, హక్కులని తీర్మానాలు చేస్తారుగదా ఇవి శాసనాలై అమలులోకి వస్తాయంటారా?"

"యెందుకురావు? ఇప్పుడు జరిగే వితంతు వివాహాలు, అవి భర్త కుటుంబాల్లో వితంతువుల హక్కులు (శారదా చట్టము) మొదలైన చట్టాలన్నీ యిల్లా తీర్మానాలుచేసి అమలులోకి వచ్చినవే గదా?"

"మాణిక్యమ్మగారు! మొన్న ఈ ఊరువచ్చి ఉపన్యాసం యిచ్చిందే విమలాదేవిగారు, ఆమె ఇంగ్లాండుకూడ వెళ్ళివచ్చిందిటకదా? పాపం ఒక్కతే వెళ్లిందండీ! అక్కడకూడ ఈ సభలకే కద? ఆడవాళ్లు మనకంటే ఉన్నవాళ్లు ఇంత కష్ట పడుతుంటే నాబోటిదానివల్ల యేమి ఉపయోగం లేదుకదా?"

"యెందుకు ఉపయోగంలేదు? ఆ పనులు చేసే వాళ్ళకు మనం సహాయం చెయ్యటమే మనవల్ల ఉప యోగం."

"మనం యే సహాయం చేస్తున్నామండీ వాళ్ళకు?"

"వాళ్లు సభలకు, సమాజాలకు వెళ్ళినప్పుడు, వాళ్ళ పిల్లలకు వేళకు పాళకు, పాలు నీళ్లు చూడటం వాళ్లు వచ్చేసరికి ఇంట్లో మనం చిర్రుబుర్రు లేకుండా యింటిపనులు నెరవేర్చుకోటం, యివ్వేవాళ్ళకు మనం చేసేసహాయం. ఆమె ఇంగ్లాండు వెళ్లిందంటే ఒక్కతే వెళ్ళదు. తగిన బందోబస్తుతోనే యింకా కొందరుకలసి వెళ్లారు. స్వరాజ్యంకోసం సత్యాగ్రహం చేసినప్పుడు ఆడవాళ్లు యెంతమంది జైళ్లకు వెళ్లారో మీకు తెలియదు. అప్పుడు మా ఇందిర కూడా జైలుకెళ్లింది. సంవత్సరం జైల్లో ఉన్నది. మా బేబి పుట్టింది జైల్లోనే. ఆడవాళ్లు మాత్రం ఊరుకున్నారా? వీలుండీ వాళ్లకు స్వేచ్ఛ యిచ్చి

నంతవరకు పురుషులతో సమానంగా స్త్రీలుకూడా పనులు చేస్తూనే ఉన్నారు.''

"చిన్నపిల్లలచేత ఆటలు పాటలు ఆడించి, వినోదాలుచూస్తూ, పుస్తకాలు చదువుకుంటూ ప్రొద్దుపుచ్చుగుంటారని అనుకున్నానుగాని, ఈ ఆడపిల్లలు ఇంత కష్టపడి దేశానికి ఇంత ఉపకారమైన పనులు చేస్తున్నారని నేననుకోలేదండి. ఇప్పుడు చూస్తుంటే, సభలు సమాజాలవల్ల దేశానికి చాలా ఉపయోగమని, ఈఆడవాళ్లంతా సభలకు వెళ్లడం, సమాజాలకు వెళ్లడం వినోదాలకుకాదని ఇప్పుడు నాకు బాగా తోస్తున్నదండి.''

"అయితే, అన్నపూర్ణమ్మగారు సమాజాల్ని గురించి మీఉద్దేశ్యం ఏమిటంటూరు?''

"మాణిక్యమ్మగారు! నిజంచెపుతున్నాను యిదివరకు మాత్రం సభలు సమాజాలు వినోదార్థమే ననుకున్నానుగాని, ఇప్పుడు నేను స్వయముగావచ్చి చూస్తున్న తరువాత సమాజాలు దేశోపకారానికేనని, అక్కడికివెళ్లేస్త్రీలు కష్టపడి ప్రజలకొరకు పనిచెయ్యటానికేనని నాకు గట్టినమ్మకం తోచిందండి,'' అన్నది అన్నపూర్ణమ్మగారు. ఇంతలో హాల్లో గడియారం ఐదుగంటలు కొట్టింది. అక్కడే ఆడుకుంటున్న అన్నపూర్ణమ్మగారి మనుమడు, మాణిక్యమ్మగారి మనుమరాలు, ఏడుస్తూలేచారు. యింటికెళదాం రా అని, రాగం మొదలుపెట్టాడు మనుమడు. మాటలతో ప్రొద్దు చాల గడిచింది, ఐదైంది యిక యింటికెళ్ళాలండి అని మనుమణ్ణి చంకపెట్టుకుని బైలుదేరింది అన్నపూర్ణమ్మగారు. అక్కడేఉన్న మనుమరాల్ని సముదాయిస్తూ చంకబెట్టుకుని వాకిలిదాకవచ్చి ఉంటానండి అని ఆమె దగ్గిర శలవుతీసుకొని ఇంట్లోకి వెళ్ళింది మాణిక్యమ్మగారు.

——(౦)——

అచ్చుపనులయందు

మీకు కావలసినది!

- అందమగు కూర్పులు
- చిన్నపనియైనను బాగుగా చేయుట
- సకాలమునకు ముద్రించి ఇచ్చుట

మీ అన్ని రకముల అచ్చుపనులను సరసమయిన చార్జీలకు చక్కగా చేసి యివ్వగలము.

ఇప్పుడు గ్రంథములనుకూడ అచ్చువేయుటకు తీసుకొనుచున్నాము.

లోధ్ర ముద్రణాలయము

రాయపేట, మద్రాసు-14.